నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, ఆదివారం 1 డిసెంబర్ 2024 | NALGONDA

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్, నవంబర్ 30 : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో శనివారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వ పనితీరు, క్షేత్రస్థాయిలో పరిస్థితి, ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, దీక్ష దివస్ జరిగిన తీరు తదితర వివరాలను కేసీఆర్ చిరుమర్తిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో దీక్షా దివస్ విజయవంతంగా జరిగినట్లు చిరుమర్తి కేసీఆర్‌కు చెప్పారు.

మాజీ సీఎం కేసీఆర్‌తో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

గ్యాస్ రావాలంటే ఫీజు కట్టాల్సిందే!

వినియోగదారుల నుంచి హెచ్‌పీ గ్యాస్ సిబ్బంది వసూళ్లు

- ప్రతి వినియోగదారుడు రూ.236 ఇవ్వాలని ఆదేశం
- తమకు సంబంధం లేదని యాజమాన్యం బుకాయింపు
- ఎలాంటి జీఓలు లేకుండా వసూలు చేస్తే చర్యలు : డీఎస్ఓ వెంకటేశ్వర్లు

నల్లగొండ, నవంబర్ 30 : 'మీకు గ్యాస్ రావాలంటే మ్యాండేటరీ ఫీజుతోపాటు కలెక్షన్ ఎమౌంట్ ఇవ్వాలి.. అది కూడా పెద్దగా లేదులే.. ఒక్క సిలిండర్‌కు జస్ట్ రూ.236' ఇది నల్లగొండ జిల్లాలో హెచ్‌పీ గ్యాస్ సిబ్బంది పేరుతో ఒక బృందం నుంచి వినిపిస్తున్న మాట. అదేంటి రెగ్యులర్‌గా గ్యాస్ డబ్బులు ఇస్తున్నాము కదా అనుకుంటే నడవదు. ఈ డబ్బులు ఇస్తేనే ఇక నుంచి మీకు గ్యాస్ డెలివరీతోపాటు బీమా, రూ.500 వస్తాయి అనే మాట వినపడడంతో.. తప్పని సరిగా వినియోగదారులు ఇవ్వక తప్పడం లేదు. ఇది వారం పది రోజుల నుంచి జిల్లాలో హెచ్‌పీ గ్యాస్ యాజమాన్యం చేస్తున్న గారడి. దీన్ని వినియోగదారులు గుర్తించి ఎదిరించి హెచ్ గ్యాస్ యాజమాన్యంతో మాట్లాడితే తాము చెప్పలేదనే సమాధానం ఎదురైనట్లు పలువురు వినియోగ దారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో ఇప్పటి వరకు ఎంతో మంది మహిళలు డబ్బులు ఇచ్చి మోసపోయినట్లు తెలుస్తుంది..


J.M. ENTERPRISES
Raghavendra Colony, Hyderabad Road, NALGONDA-508001.
Ph :08682-248587, 248588.
EMERGENCY CELL No: 9490137707, 9666023456
(8 pm to 8 am IN WORKING DAYS - HOLIDAYS 24 HOURS)
RECEIPT
No. 2157 Date:
Received with thanks from
Consumer No. a sum of Rupees Two Hundred Thirty Six
only 236/- 18% GST Includes towards MANDATORY CUSTOMER INSPECTION CHARGES
as per the guidelines of Ministry of Petroleum, Govt. of India, valid for 5 Years
Signature of Customer
GST Provisional ID: 36AAFFJ5357C1ZH
Signature of MC Executive

హెచ్‌పీ గ్యాస్ పేరుతో ప్రింట్ చేసిన రసీదు

1.85 లక్షల మంది వినియోగదారులు

జిల్లాలో 4.70 లక్షల మంది ఎల్‌పీజీ గ్యాస్ గ్యాస్ కనెక్షన్ దారులు ఉండగా అందులో హెచ్‌పీ గ్యాస్‌కు సంబంధించి 1.85 లక్షల మంది ఉన్నారు. గ్యాస్ రావాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరి ఫీజుతోపాటు ఇతర ఖర్చులు చెల్లించాల్సిందేనని యాజమాన్యం చెప్తుందని అందులో పని చేస్తున్న సిబ్బంది అంటున్న పరిస్థితి. ఇదిలా ఉండగా గ్యాస్ సిలిండర్‌ను రూ.874కే ప్రభుత్వం ఇవ్వడంతో పాటు కొందరికి ఉచిత గ్యాస్ పేరుతో రూ.500 తిరిగి చెల్లిస్తున్నది. దీన్ని దృష్టిలో పెట్టుకొని తమకు కనీసం మరో రూ.50 సిలిండర్‌కు ఇవ్వాలనే డిమాండ్ సిబ్బంది చేయటంతో తప్పలేక వినియోగా దారులు ఇవ్వక తప్పడం లేదు. దీని పేరుతో వసూళ్లు జరుగుతున్నట్లు జిల్లా సివిల్ సప్లయ్ యంత్రాంగం గుర్తించి పలు గ్యాస్ యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందనే ఆరోపణలు ఉన్నాయి..

మా దృష్టికి రాలేదు

హెచ్‌పీ గ్యాస్ వారు అనధికారికంగా మ్యాండేటరీ పేరుతో వినియోగ దారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. దీనిపై వెంటనే విచారణ చేసి వారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ నిబంధనలకు లోబడే గ్యాస్ సరఫరా చేయాలి. కానీ దానికి సంబంధించిన జీఓ ఇప్పటి వరకు మాకు రాలేదు. ఇదిలా ఉండగా హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకురాలు చంద్ర కళను వివరణ కోరితే సమాధానం దాటవేశారు.

- వెంకటేశ్వర్లు, డీఎస్ఓ, నల్లగొండ

డబ్బులు వసూలు చేయడం సరికాదు

మాకు ఉజ్వల పేరుతో గ్యాస్ సిలిండర్ వచ్చింది. నెలకు సబ్సిడీ వస్తుందో రావటం లేదో అర్థం కావడం లేదు. అయినా డబ్బులు కట్టి సిలిండర్ తెచ్చుకుంటున్నాం. ఈ రోజు మ్యాండేటరీ పేరుతో డబ్బులు ఇవ్వాలని ఇద్దరు వ్యక్తులు మా ఇంటికి రావడంతో అడిగాం. వాళ్లు సమాధానం చెప్పకపోవడంతో హెచ్‌పీ గ్యాస్ వాళ్లకు ఫోన్ చేశాం. వాళ్లు కూడా సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారు. డబ్బులు తీసుకునే వాళ్ల దగ్గర హెచ్‌పీ గ్యాస్ లబ్ధిదారుల జాబితాతో పాటు అనేక మంది డబ్బులు కట్టిన రసీదులు ఉన్నాయి.

- పాలకూరి రమాదేవి. గృహిణి, నల్లగొండ

ఆందోళన బాటలో మోడల్ స్కూల్ టీచర్లు

- సమస్యలు పరిష్కరించకుంటే డిసెంబర్ మొదటి వారం నుంచి నిరసనలు
- ఇప్పటికే విద్యాశాఖ కమిషనర్, మోడల్ స్కూల్ ఉన్నతాధికారులకు ఆందోళన నోటీసులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 32 మోడల్ స్కూళ్లు.. 520 మంది ఉపాధ్యాయులు

రామగిరి, నవంబర్ 30 : తెలంగాణ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. దీంతో ఇప్పటికే పలు పర్యాయాలు వారు ఆందోళన చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో డిసెంబర్ మొదటి వారం నుంచి దశలవారీగా ఆందోళనకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా విద్యాశాఖ కమిషనర్‌తోపాటు మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్‌కు ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(పీఎంటీఏ-టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా నోటీసులను అందజేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 32 మోడల్ స్కూళ్లల్లో 520మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 17 పాఠశాలలు 270 మంది, సూర్యాపేట జిల్లాలో 9పాఠశాలలు 150 మంది, యాదాద్రిభువనగిరి జిల్లాలో 6 పాఠశాలలు 100మంది పనిచేస్తున్నారు.

పరిష్కరించాల్సిన సమస్యలు ఇవే..

- మోడల్ స్కూళ్లను పాఠశాల విద్య డైరెక్టరేట్‌లో విలీనం చేయాలి. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు అందజేయాలి.
- ఒకే నోటిఫికేషన్ కింద ఎంపికైనప్పటికీ రెండో దశ నియామకమైన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు మెమో 4953/SER III/2021, ప్రకారం వారికి మొదటి దశ వారితో సమానంగా నోషనల్ సర్వీస్ , నోషనల్ ఇంక్రిమెంట్ వర్తింపజేయాలి.
- మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్యాని యమాకాలు కల్పించాలి. సీపీఎస్ డెత్ గ్రాడ్యూటీ, ఫ్యామిలి పెన్షన్ అందించాలి.
- ప్రమోషన్లు వెంటనే చేపట్టాలి. పెండింగ్ బకాయిలు చెల్లించాలి.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

మోడల్స్ స్కూళ్ల టీచర్ల సమస్యలు పరిష్కరించాలని గత 11 సంవత్సరాలుగా ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో డిసెంబర్ మొదటి వారంలోగా సమ్మెలోకి వెళ్తామని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి తన సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నా.

- తరాల జగదీశ్, రాష్ట్ర అధ్యక్షుడు, పీఎంటీఏ- టీఎస్

డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రాధాన్యత రంగాలకు రుణాలు అందించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, నవంబర్ 30 : ప్రాధాన్యత రంగాలకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం డీసీసీ, డీఎల్ఆర్సీ సమవేశంలో చైర్మన్ హోదాలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూ. 8,994.16 కోట్ల లక్ష్యంగా రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. రెండో త్రైమాసానికి రూ.5,700.39 కోట్ల రుణాలు అందించి 63.38 శాతం లక్ష్యాలను సాధించామన్నారు. అత్యధికంగా వ్యవసాయ రంగాలకు రుణాలు ఇవ్వడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇప్పటి వరకు 84.65 శాతం లక్ష్యాలను చేరుకున్నామన్నారు. వ్యవసాయ రంగానికి రూ. 2,942.48 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా రెండో త్రైమాసికానికి రూ. 2,490.73 కోట్లు రుణాలు ఇచ్చామని తెలిపారు. వీటితోపాటు దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలకు గానూ 97.13 శాతం వృద్ధి సాధించామన్నారు. ఆర్థిక సంవత్సరానికి రూ. 1,004.8 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా రూ. 976 కోట్లు రుణాలు అందించామన్నారు. ప్రాధాన్యత రంగాలకు రెండో త్రైమాసికంలో 62.17 శాతం రుణాలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఎల్‌డీఎం బాపూజీ, డీఆర్‌డీఓ అప్పారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, డీటీడీఓ శంకర్, ఆర్‌బీఐ ఏజీఎం గౌతమి, నాబార్డు డీడీఎం సత్యనారాయణ, ఎస్‌బీఐ ఆర్‌ఎం ఉపేంద్రభాస్కర్, యూబీఐ డీఈఎం హనుమంతరెడ్డి , పరిశ్రమల శాఖ జీఎం సీతారాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

రామానంద తీర్థలో సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 30 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామం స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరునెలల కాల పరిమితితో కూడిన ఎలక్ట్రిషన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టం, ఇన్‌స్టాలేషన్, సర్వీస్ (ఐటీఐ/డిప్లొమో పాస్), కంప్యూటర్ హార్డ్వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ , సీసీటీవీ టెక్నీషియన్ (పదో తరగతి) టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి, క్విల్డ్ బ్యాగ్స్ మేకింగ్ (ఎనిమిదో తరగతి పాస్) కోర్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు, ఆదాయ సర్టిఫికెట్‌లతో డిసెంబర్ 9న ఉదయం 10 గంటలకు రామానంద సంస్థలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, హాస్టల్ భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. వివరాలకు 9133908000, 9133908111, 913390 8222 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల లొల్లి

అర్వపల్లి, నవంబర్ 30: అర్వపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఉర్సు ఉత్సవాలకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుకు స్వాగతం పలుకుతూ జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే, కొందరు ఆ ఫ్లెక్సీలను చింపివేశారు. దీంతో అదే పార్టీకి చెందిన కొందరు ఓర్వలేనితనంతో దళిత ఎమ్మెల్యే అని కూడా చూడకుండా అవమానపర్చేలా ఫ్లెక్సీలు చింపివేశారని కుంట్ల సురేందర్‌రెడ్డి ఆరోపించారు. తాము కూడా తలుచుకుంటే ఇన్ని రోజులు వారు ఏర్పాటు చేసిన ఒక్క ఫ్లెక్సీ కూడా ఉండకపోయేదని అన్నారు. ఏదైనా ఉంటే ప్రజా క్షేత్రంలో తేల్చుకోవాలి కానీ ఇలా దొంగచాటుగా ఫ్లెక్సీలు చింపడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఫ్లెక్సీలు చింపిన వారు దొరకడంతో పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు సురేందర్ రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- మెనూ కచ్చితంగా పాటించాల్సిందే..
- రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్

కొండమల్లేపల్లిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంట సిబ్బందికి సూచనలు ఇస్తున్న విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ చిత్రంలో డీఈఓ భిక్షపతి

కొండమల్లేపల్లి/గుర్రంపోడ్, నవంబర్ 30 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రుచికరమైన నాణ్యతతో కూడిన భోజనం అందించాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ అన్నారు. కొండమల్లేపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను శనివారం డీఈఓ బొల్లారం భిక్షపతితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే గుర్రంపోడ్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. వంటగదులు, వసతులు, కూరగాయల నిల్వ గదిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా చారకొండ వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతతో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. వంటల్లో నాణ్యత, శుభ్రత పాటించాలని సూచించారు. తాజా కూరగాయలు, అకుకూరలతో భోజనం వండాలని, మెనూ బోర్డులను అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. రోజు వారీగా విద్యార్థులకు అందిస్తున్న మెనూపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంఈఓ నాగేశ్వర్‌రావు, కేజీబీవీ స్పెషల్ అఫీసర్ కత్తుల సరళ, ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శౌరి, కట్టబోయిన శ్రీనివాస్ యాదవ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.ఆనంద్, ఉపాధ్యాయులు అనంతరాములు, ప్రదీప్, జగన్, శ్రీనివాసులు, చిన్నయ్య, రాని, గీత, రమేశ్, సత్యనారాయణ, కేర్ టేకర్ స్వాతి ఉన్నారు.

నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పాఠశాలల బంద్ ప్రశాంతం

రామగిరి, నవంబర్ 30 : ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, మధ్యాహ్న భోజనం వండే కార్మికులకు ప్రతి నెల వేతనాలు ఇవ్వాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యుడు శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పెరుగుతున్నాయన్నారు. కస్తూర్బా, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్, తదితర సమస్యలతో విద్యార్థులు చదువుకునే పరిస్థితి లేదని, తక్షణమే ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు, నేతలు పాల్గొన్నారు.

గురుబ్రహ్మ ఇదేం ఖర్మ..!

- విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన
- నిడమనూరు మోడల్ స్కూల్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన
- ఘటనపై ఆరా తీసిన ఎమ్మెల్యే

నిడమనూరు ఆదర్శ పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

నిడమనూరు, నవంబర్ 30 : విద్యా బుద్ధులు నేర్పి.. బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. సబ్జెక్టుకు సంబంధం లేని అశ్లీల మాటలతో అనుచితంగా ప్రవర్తించిన ఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు ఆదర్శ పాఠశాలలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఉపాధ్యాయుడి వ్యవహార శైలితో విసిగిపోయిన విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలుపడంతో శనివారం పాఠశాల ఎదుట విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చేసి నిలదీశారు.

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు దొడ్డా ఆంజనేయులు సుమారు రెండు నెలల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా వచ్చాడు. 6,7,8 తరగతుల విద్యార్థులకు సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలను బోధిస్తున్నాడు. విద్యార్థినులను తన సొంత బిడ్డల్లా చూసుకోవాల్సింది పోయి సబ్జెక్టుకు సంబంధం లేని అశ్లీల విషయాలను మాట్లాడుతూ అనుచితంగా ప్రవర్తించడం విద్యార్థినులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇటీవల విద్యార్థినుల ప్రైవేటు భాగాల్లో శరీరాన్ని తాకుతూ పాఠ్యాంశాలను బోధించడంతో పాటు పుట్టుమచ్చలు చూపించాలంటూ మాట్లాడుతున్న తీరుతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపిస్తూ ఉపాధ్యాయుడు ఆంజనేయులు తీరుపై పలువురు విద్యార్థినులు పాఠశాల ప్రిన్సిపాల్ బూరుగు నిర్మలకు రెండు రోజుల క్రితం ఫిర్యాదు కూడా చేశారు. తల్లిదండ్రులకు విషయం తెలుపడంతో శనివారం పాఠశాల వద్దకు చేరుకుని ఎస్ఎఫ్ఐ.ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల చర్చలు జరిపి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కష్టపడి కూలినాలీ పనులు చేసుకుంటూ పిల్లలను పాఠశాలకు పంపిస్తే అసభ్యంగా ప్రవర్తించడమేంటని తల్లిదండ్రులు నిలదీశారు. విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన ఘటనపై పాఠశాలను శనివారం మధ్యాహ్నం నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి సందర్శించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఘటన పై పారదర్శకంగా విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వాస్తవాలను వెలుగులోకి తేవాలని అక్కడే ఉన్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజుకు సూచించారు. ఎమ్మెల్యే వెంట హాలియా సీఐ. జనార్దన్ గౌడ్, ఎస్ఐ.గోపాల్ రావు, నాయకులు ఉన్నం చిన్నవీరయ్య, చేకూరి వంశీచరణ్, కుంచం సతీశ్, బొల్లం శ్రీనివాస్ యాదవ్, విశ్వనాథులు రమేశ్, శేషరాజు శ్రీనివాస్, చింతల చంద్రారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మన్నెం శంకర్, గాయకవాడ లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

విచారణ చేశాం

విద్యార్థినుల ఫిర్యాదుతో ప్రాథమిక విచారణ నిర్వహించాం. సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఉపాధ్యాయుడిని ఆదేశించాం. ఈ విషయమై ఆదర్శ పాఠశాలల ఏడీకి సమాచారం ఇచ్చాం. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

- ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల

అసభ్య ప్రవర్తన అవాస్తవం

విద్యార్థినుల పట్ల తాను అసభ్యంగా ప్రవర్తించానన్న ఆరోపణలు అవాస్తవం. రెండు నెలల క్రితమే బదిలీపై వచ్చిన నేను చనువుగా వ్యవహరించడం వల్ల విద్యార్థినులు అపార్థం చేసుకున్నారు. నాకూ పిల్లలున్నారు.. దైవ సాక్షిగా నాకు ఎలాంటి దురుద్దేశం లేదు. సబ్జెక్టుకు సంబంధం లేని అశ్లీల విషయాలను విద్యార్థినులతో మాట్లాడలేదు.

- దొడ్డా ఆంజనేయులు, ఉపాధ్యాయుడు

మైనారిటీ విద్యార్థుల విదేశీ విద్యకు దరఖాస్తులు

నీలగిరి, నవంబర్ 30 : విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుకోవాలనుకునే జిల్లాలోని మైనారిటీ విద్యార్థులు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకంలో డిసెంబర్31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి టి.విజేందర్‌రెడ్డి ఒకప్రకటనలో తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీజీ, డాక్టోరల్ కోర్సులకు సంబంధించి అమెరికా, కెనెడా, బిట్రన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, సింగపూర్, న్యూజిలాండ్ దేశాల్లో 2024 ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు అడ్మిషన్ పొందిన వారు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని, ఆయా హార్డ్ కాపీలను జనవరి 10లోగా కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

3న మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

హాలియా, నవంబర్ 30 : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహింపేటలో డిసెంబర్ 3 మధ్యాహ్నం 3.30 గంటలకు జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షకార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారినులు 75 కేజీల కంటే తక్కువ బరువు కల్గి ఉండాలని, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. జిల్లా మహిళా కబడ్డి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7, 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న 71వ అంతర్‌రాష్ట్ర మహిళా కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనన్నట్లు వారు తెలిపారు.